సాక్షి ఖమ్మం

శుక్రవారం : 29 : నవంబర్ : 2024



రుణమాఫీపై ఆశలు

రుణమాఫీ అమలుకాని రైతులకూ నిధులు విడుదల చేస్తామన్న మంత్రి ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 8లో



ఉద్యోగుల మానసికోల్లాసానికే..

ఆర్టీసీ ఉద్యోగుల మానసికోల్లాసం కోసమే వన భోజనాలు ఏర్పాటుచేస్తున్నట్లు రీజినల్ మేనేజర్ సరిరామ్ వెల్లడించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 21°

జిల్లాలో శుక్రవారం రోజంతా కనిష్టస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, సాయంత్రం చలి తీవ్రంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వచ్చేనెల 2నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియ వచ్చేనెల 2వ తేదీన మొదలవుతుందని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. దూర విద్యా విధానంలో చదివేందుకు ఆసక్తి ఉన్న అభ్యాసకులు వచ్చేనెల 2నుంచి 11వ తేదీ వరకు సెంటర్లు కలిగిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 80084 03522 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

అత్యవసర సేవలపై అప్రమత్తంగా ఉండాలి



క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రికి అత్యవసర సేవల కోసం ప్రజలు వస్తున్నందున వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. ఆస్పత్రిని గురువారం తనిఖీ చేసిన ఆమె క్యాజువాలిటీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే, వృద్ధులకు ప్రతీ శుక్రవారం ఓపీ సేవలు అందించాలని నిర్ణయించగా, ఓపీ కోసం కేటాయించిన గదిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆతర్వాత డయాలసిస్ విభాగంలో సేవలను పరిశీలించి రోజువారీ వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి భవనం పైభాగంలో మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్వహణ, క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అలాగే, ఆస్పత్రి ఆవరణలో ఉన్న 104 వాహనాలకు తక్షణం వేలం నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ రాథోడ్ వినాయక్, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మధిర: పత్తి తీసుకొచ్చే రైతులు ఇబ్బంది పడకుండా నిబంధనల మేరకు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. మధిర మండలం దెందుకూరులోని కనకదుర్గ కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రైతులు పండించిన పత్తికి తేమ శాతం ఆధారంగా మద్దతు ధర చెల్లించాలని సూచించారు. ఇదేసమయాన రైతులు పత్తి ఆరబెట్టి తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, సీసీఐ కేంద్రంలో అవకతవకలకు జరగకుండా చూడాలని చెప్పారు. అనంతరం తేమ శాతం పరీక్షలు, తూకం, ధర నమోదు తదితర అంశాలను అదనపు కలెక్టర్ ఆన్‌లైన్‌లో పరిశీలించారు. అలాగే, రైతులతో మాట్లాడి ఎన్ని రోజుల్లో ఖాతాలో నగదు జమ అవుతోందని ఆరా తీశారు. తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ టీవీఎల్‌ఎన్.శాస్త్రి, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

లష్కర్ల నియామకానికి దరఖాస్తుల వెల్లువ

200 పోస్టులకు వెయ్యికి పైగానే దాఖలు

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో లష్కర్లను నియమించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. జిల్లాల్లో 200 మందిని కాంట్రాక్టు విధానంలో నియమించుకునేందుకు అనుమతించింది. ఈనేపథ్యాన ఇంజనీర్ల కమిటీ ఆధ్వర్యాన ప్రభుత్వ నిబంధనల మేరకు లష్కర్లను ఎంపిక చేయడంతోపాటు ఆపై పర్యవేక్షణ బాధ్యతలను ఏజెన్సీకి అప్పగిస్తారు. స్థానికులై, 45 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారిని అర్హులుగా ప్రకటించగా, కంపచెట్లు తొలగింపు, చిన్నపాటి గుంతలు పూడ్చే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్న వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు జలవనరులశాఖ నుంచి ప్రకటన విడుదల కాకున్నా ప్రభుత్వం నిర్ణయంపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కార్యాలయాల్లో పలువురు దరఖాస్తులు అందిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో 200మంది లష్కర్లను నియమించనుండగా, బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రాలతో సుమారు వెయ్యి మంది దరఖాస్తులు అందించినట్లు తెలిసింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముండగా, నియామకం కోసం ఇంజనీర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

పురుగుల బియ్యంతోనే అన్నం..

ప్రతినెలా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరఫరా

- అయినా హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో నాసిరకం బియ్యం
- విద్యార్థుల సంఖ్యకు మించి బియ్యం దిగుమతితో నెలల తరబడి నిల్వ
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్దే పక్కదారి పట్టిస్తున్న కొందరు?
- కలెక్టర్ తనిఖీ చేయించే వరకూ గుర్తించని అధికారులు



నాణ్యమైన భోజనం సమకూర్చాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో లంచ్ బాక్సులు, ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలు, గురుకులాల్లో నాణ్యమైన సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం సమకూరుస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. నెలల తరబడి నిల్వ ఉండి.. పురుగులు పట్టిన బియ్యంతోనే భోజనం చేయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఏఎస్‌డబ్ల్యూఓలు, విద్యాశాఖ, గురుకులాల అధికారులు తనిఖీలను మరిచారా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక అధికారులతో సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలు, గురుకులాల్లో తనిఖీ చేయించేవరకు అక్కడ పరిస్థితులను గుర్తించలేకపోవడం గమనార్హం.

ఏ నెలకానెల..

ప్రతినెలా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీ, గురుకులాలకు బియ్యం సరఫరా అవుతాయి. ఓ పాఠశాలలో 100మంది విద్యార్థులు ఉంటే నెలకు 16క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు బియ్యం అందజేస్తారు. అయితే కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య నమోదు కన్నా ఎక్కువగా చూపిస్తూ బియ్యం దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. ఫలితంగా ఏనెలకానెల బియ్యం మిగులుతూ పురుగులు పడుతున్నట్లు తెలిసింది.

సన్న, ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా

సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా సన్న, ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అయినా పలు వసతిగృహాలు, కేజీబీవీల్లో నిల్వ ఉండి పురుగులు పట్టిన బియ్యమే వినియోగిస్తున్నారు. జిల్లా అధికారులు ఇటీవల తనిఖీ చేసినప్పుడు ఈ విషయం బయటపడింది. చాన్నాళ్లు నిల్వ ఉన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం వండి వడ్డిస్తున్నట్లు అధికారులు గుర్తించి కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికల్లో పొందుపర్చినట్లు తెలిసింది. రేషన్ దుకాణాల నుంచి వచ్చిన బియ్యాన్ని రెండు, మూడుసార్లు కడిగాకే భోజనం తయారు చేయాల్సి ఉన్నప్పటికీ పురుగుల పట్టిన బియ్యాన్ని సక్రమంగా కడగకుండానే వండి పెడుతున్నట్లు సమాచారం. దీంతో చాలామంది విద్యార్థులు భోజనం చేయలేకపోతున్నారని తెలిసింది.

అటు నుంచి అటే..

ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలకు సరఫరా కావాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నాయనే విమర్శలున్నాయి. ఖమ్మం మినహా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వసతిగృహాల్లో విద్యార్థుల నమోదు, హాజరుకు పొంతన ఉండడం లేదని.. ఫలితంగా వార్డెన్లు ఎక్కువ మొత్తంలో బియ్యం తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ బియ్యాన్ని కొందరు ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బయటకు రాగానే విక్రయిస్తుండగా.. ఇంకొందరు కొన్నాళ్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల మిగిలిన బియ్యం నెలల పాటు నిల్వ ఉండడంతో పురుగులు పడుతున్నట్లు సమాచారం.

తనిఖీలు చేపట్టే వరకు..

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులతో హాస్టళ్లలో తనిఖీ చేయించేవరకు వాస్తవ పరిస్థితులు వెలుగుచూడలేదు. సంక్షేమ శాఖలకు ఏఎస్‌డబ్ల్యూఓ స్థాయి అధికారులు ఉన్నప్పటికీ వారు వసతిగహాల్లో సమస్యలను గుర్తించడం లేదు. తూతూమంత్రంగా తనిఖీ చేస్తూ చేతులు దులుపుకోవడంతోనే వసతిగృహాలు అధ్వానంగా మారాయని విమర్శలు వస్తున్నాయి. వసతిగృహాల్లో బియ్యాన్ని కూడా పరిశీలించలేని స్థితిలో ఏఎస్‌డబ్ల్యూఓలు ఉన్నారా.. అని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రతీ డివిజన్‌కు ఒక ఏఎస్‌డబ్ల్యూఓ ఉన్నప్పటికీ ఈ పరిస్థితులు నెలకొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కేజీబీవీల్లో విద్యాశాఖ అధికారులు, గురుకులాల్లో గురుకుల అధికారుల పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా విద్యార్థులకు పురుగుల అన్నం దిక్కవుతోంది.

6న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

- ఆస్పత్రుల సందర్శన, కలెక్టరేట్‌లో సమీక్ష
- ఏర్పాట్లపై సూచనలు చేసిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వచ్చే నెల 6న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈమేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించి సూచనలు చేశారు. డిసెంబర్ 6న ఉదయం ఖమ్మం చేరుకోనున్న మంత్రి జిల్లా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేయించి అవసరమైన చోట సైన్ బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై మంత్రి సమీక్షించనున్న నేపధ్యాన ఉద్యోగులు నివేదికలు తయారుచేయాలని తెలిపారు. అక్కడినుంచి మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలిస్తారని వెల్లడించారు. ఈసమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, డీఎంహెచ్ డాక్టర్ కళావతి బాయి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

జిల్లాలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అధికారులు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. రాబోయే మూడు నెలల పాటు డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ, వీటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రతీ మండలంలో బృందాలు ఏర్పాటు చేసి వారానికి రెండు విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, వివిధ సంఘాల బాధ్యులు జి.గోపాల్‌రెడ్డి, గోపాల్‌స్వామి, ఎం.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మిన 48 గంటల్లో బోనస్



వేంసూరు : వరి కోతలను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

వేంసూరు/తల్లాడ: ధాన్యం కాంటా పూర్తయి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ జమ అవుతోందని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య వెల్లడించారు. వేంసూరు మండలంలోని మర్లపాడు, చౌడవరం, పల్లెవాడ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు వానాకాలం సీజన్ పంటల నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. అలాగే, వరి కోతల అనంతరం దుబ్బులను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని సూచించారు. అనంతరం జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న సాగుపై ఆయన అవగాహన కల్పించారు. ఏఓ రాంమోహన్, ఏఈఓలు, సొసైటీ సీఈఓలు పాల్గొన్నారు. కాగా, తల్లాడలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని కూడా డీఏఓ తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉదయాన్నే కొనుగోళ్లు ప్రారంభించాలని, సాయంత్రం ఆరు గంటల తర్వాత రైతులు వస్తే అధికారుల నుంచి అనుమతితోనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, తల్లాడ ఏఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైల్వేలైన్ల అలైన్‌మెంట్ మార్చండి

రైల్వే బోర్డు చైర్మన్‌ను కోరిన ఎంపీ రఘురాంరెడ్డి



రైల్వేబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

ఖమ్మం వన్‌టౌన్: పాలేరు నియోజకవర్గంతో పాటు స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోని భూముల్లో వెళ్లేలా ప్రతిపాదించిన డోర్నకల్ – మిర్యాలగూడ, డోర్నకల్–గద్వాల రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. సారవంతమైన భూములను రైల్వేలైన్‌కు సేకరించనుండడంతో రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో రైల్వేబోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిసిన ఎంపీ వినతిపత్రం అందజేసి మట్లాడారు. ఖమ్మంలో మూడో రైల్వేలైన్ నిర్మాణం పూర్తికావొస్తుండగా, ఆరు జాతీయ రహదారులతో అనుసంధానం ఉందని తెలిపారు. ఈ నేపథ్యాన కొత్త రైల్వే లైన్‌తో ప్రజలకు నష్టమే తప్ప లాభం ఉండదని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయంగా డోర్నకల్ వయా వెన్నారం, మన్నెగూడెం, మరిపెడ, మోతే మీదుగా లైన్ నిర్మించాలని కోరారు. తద్వారా దూరంతో పాటు భూసేకరణ, నిర్మాణం వ్యయం తగ్గుతుందని తెలిపారు. ఈమేరకు తన వినతితో రైల్వేబోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎంపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

పీఎం ఉజ్వల యోజనపై..

ఆదివాసీ, గిరిజనులు వంటగ్యాస్ రీఫిల్లింగ్ కోసం పడుతున్న కష్టాలను పరిష్కరించాలని ఎంపీ రఘురాంరెడ్డి కోరారు. గ్యాస్ కనెక్షన్ల అంశంపై ఆయన గురువారం పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువులు, పర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్‌గోపి సమాధానమిచ్చారు. 2016 నుంచి ఇప్పటివరకు ఖమ్మంలో 83,176, భద్రాద్రి జిల్లాలో 71,556 మందికి పీఎం ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్లు జారీ చేయడమే కాక రీఫిల్లింగ్, సబ్సిడీ కొనసాగిస్తున్నామని తెలిపారు. అలాగే, వంటనూనెలపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ సమాధానమిచ్చారు.

ఆ దంపతులకు శత్రువులెవరు?

- జంట హత్యలపై ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు
- పలువురు అనుమానితుల విచారణ
- నేలకొండపల్లిలో అధికారులతో పోలీసు కమిషనర్ భేటీ



నేలకొండపల్లి పోలీసుస్టేషన్ నుంచి వెళ్తున్న సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన దంపతుల హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. నేలకొండపల్లికి చెందిన ఎర్రా వెంకటరమణ – కృష్ణకుమారి మంగళవారం అర్ధరాత్రి వారి ఇంట్లో హత్యకు గురైన విషయం విదితమే. ఈమేరకు నిందితులను గుర్తించేందుకు పోలీసు అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్‌కు చెందిన అధికారులతో ఆరు బృందాలను ఏర్పాటు చేయగా, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించారు.

కాల్‌డేటా, సీసీ ఫుటేజీలు

హత్య కేసులో నిందితులను గుర్తించేందుకు తొలుత మృతులకు ఎవరైనా శతృవులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. మృతుల సెల్‌ఫోన్ల కాల్‌డేటా ఆధారంగా ఇప్పటికే సరిహద్దు గ్రామాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. అంతేకాకుండా మండల కేంద్రంలో తిరుగుతున్న హిజ్రాలను సైతం విచారించినట్లు తెలిసింది. వీటికి తోడు మృతుల ఇంటికి సమీపాన పలువురి ఇళ్లు, షాపుల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు సేకరించి నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎవరైనా ఇంటి అద్దె కోసం మహిళలు వచ్చి ఉంటే ఆ వివరాలు తెలియచేయాలని సోషల్ మీడియా ద్వారా పోలీసులు కోరారు. మృతులతో కలిసి భోజనం చేసేంత చనువు ఉన్న వారెవరనే కోణంలో ముదిగొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇక మృతుడు వెంకటరమణ గతంలో బియ్యం వ్యాపారం చేసి ఉన్నందున ఆయనతో వ్యాపార సంబంధాలు కలిగిన వారినీ విచారిస్తున్నారు. అంతేకాక ఇటీవల ఆస్తుల అమ్మకం, కొనుగోళ్లు ఏమైనా జరిగాయా అన్న అంశంపైనా కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

దర్యాప్తుపై సమీక్షించిన సీపీ

నేలకొండపల్లిలో దంపతుల హత్య రాష్ట్రంలో కలకలం రేపగా, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. హత్యలపై పోలీస్ అధికారులతో సమీక్షించిన ఆయన అనుమానితుల విచారణ, ఆధారాల సేకరణపై సూచనలు చేసినట్లు తెలిసింది. దర్యాప్తులో వేగం పెంచాలని సూచిస్తూ అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు సంజీవ్, మురళి, ఎస్సైలు పాల్గొన్నారు. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు త్వరలోనే నిందితులను గుర్తిస్తామనే భావనలో ఉన్నట్లు సమాచారం.

ఆలయానికి మహర్దశ

లక్ష్మీనర్సింహస్వామి ఆలయాభివృద్ధికి రూ.4.74కోట్లు



యడవల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ముదిగొండ: ముదిగొండ మండలం యడవల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఆలయ అభివృద్ధికి రూ.4.74 కోట్ల నిధులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రతీ ఎన్నికల సమయాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ ఆలయంలో పూజలు చేశాకే ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. ఈమేరకు భట్టి విక్రమార్క చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంతో ఆలయం మరింత అభివృద్ధి చెందనుంది. కాగా, కేటాయించిన నిధులతో ఏయే పనులు చేపట్టనున్నారో కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోనేరు నిర్మాణానికి రూ.1.4కోట్లతో పాటు వేదిక నిర్మాణానికి రూ.26.50లక్షలు, రాజగోపురానికి రూ.36లక్షలు, గెస్ట్‌హౌస్‌కు రూ.18లక్షలు, ఆర్చ్ గేట్‌కు రూ.8.50 లక్షలు, ప్రాకారం నిర్మాణానికి రూ.42లక్షలు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. అలాగే, డార్మీటరీ హాళ్ల నిర్మాణానికి రూ.76లక్షలు, టాయిలెట్ బ్లాక్‌లకు రూ.15లక్షలు, విమాన గోపురానికి రూ.15లక్షలు, కల్యాణమండపం నిర్మాణానికి రూ.24లక్షలు, బలిపీఠం కోసం రూ.4.50లక్షలు, వాహన శాల నిర్మాణానికి రూ.8.50లక్షలు వెచ్చించనుండగా, ఇతర అభివృద్ధి పనులకు మిగతా నిధులు కేటాయించనున్నారు. కాగా, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు కందిమళ్ల వీరబాబు, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, దొంతగాని కాశయ్య, చెరుకుపల్లి రాంబాబు తదితరులు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

భోజన నిర్వహణలో లోపాలు ఉండొద్దు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

సత్తుపల్లి: మధ్యాహ్న భోజనంలో లోపాలు ఎదురుకాకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనా సూచించారు. సత్తుపల్లి మండలం కిష్టారంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. తరగతి గదులు, మధ్యాహ్నం భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించాక విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో కోతుల బెడద ఎక్కువగా ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లగా చుట్టూ ప్రహరీ నిర్మాణం, సోలార్ ఫెన్సింగ్ త్వరగా ఏర్పాటుచేయాలని సింగరేణి పీఓకు సూచించారు. అనంతరం సీఈఓ విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగాక పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సయ్యద్ సమద్‌తో పాటు మహ్మద్ రియాజుద్దీన్, రత్నాకర్, వెంకటేశ్వరరావు, కళావతి, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓజేటీ సెంటర్లలో డీఐఈఓ పరిశీలన


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఐఈఓ రవిబాబు

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి ఓజేటీ(ఆన్ ద జాబ్ ట్రైనింగ్) సెంటర్లను డీఐఈఓ రవిబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చదువుకుంటూనే శిక్షణ ద్వారా నైపుణ్యం సాధించొచ్చని, అనంతరం పైచదువులకు అర్హత సాధించేలా బ్రిడ్జి కోర్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. తొలుత డీఐఈఓ పీహెసీ, మెడికల్ ల్యాబ్, సొసైటీలో పరిశీలించి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి, అధ్యాపకులు శ్రీవనిత, దుర్గాప్రసాద్, యాకూబ్‌పాషా తదితరులు ఉన్నారు.

'సహకార' అధికారుల కమిటీ ఎన్నిక


సంఘం నూతన కార్యవర్గం..

ఖమ్మంవ్యవసాయం: సహకార శాఖలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఖమ్మంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కొల్లిమర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.శ్రీదేవి, కార్యదర్శిగా బి.ఏడుకొండలు, కోశాధికారిగా ఎస్‌డీవీ.రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సెంట్రల్ అసోసియేషన్ కోశాధికారి గంధం శ్రీనివాసరావు వ్యవహరించారు.

'విద్యార్థుల ఇబ్బందులపై స్పందించని ప్రభుత్వం'

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాసిరకం భోజనంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. ఈ సందర్భంగా గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ప్లేట్లు, లంచ్ బాక్స్‌లతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఎన్నెస్పీ క్యాంప్ వద్ద ఆందోళన చేశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ పేదలు తమ బిడ్డల భవిష్యత్ కోసం సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తే కార్పొరేట్ విద్య, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో విఫలమవుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యార్థులకు న్యాయమైన భోజనం సమకూర్చాలని, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, పృథ్వీ, యశ్వంత్, వెంకటేష్, ప్రసాద్, కావ్య, అలేఖ్య, అనూష,సింధు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీలో తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు(ఏపీజీవీబీ)లో కొన్నేళ్లుగా రోజువారి వేతనాలతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించారు. తెలుగు రాష్ట్రాల్లోని 776 ఏపీజీవీబీ శాఖల్లో 456 మందిని రెగ్యులర్ చేస్తూ బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు బ్యాంకు ఖమ్మం రీజియన్ పరిధిలో పలువురికి జాబితాలో స్థానం దక్కగా, వీరిలో కొందరిని ఇతర శాఖలకు బదిలీ చేసినట్లు సమాచారం. కాగా, గ్రామీణ బ్యాంకు అధికారులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యానతాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపడుతుండగా ఎట్టకేలకు వారి కల ఫలించింది.

ఏపీలో ధాన్యం కొని.. ఇక్కడ విక్రయానికి యత్నం

వేంసూరు: జిల్లాలోని పలు మండలాలు ఏపీకి సరిహద్దుగా ఉండగా, ఇక్కడ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండడంతో అక్కడి వ్యాపారులు తీసుకొచ్చే అవకాశముందని అధికారులు ముందుగానే భావించారు. ఈమేరకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేశారు. అయితే జిల్లా వ్యాపారే ఏపీలో ధాన్యం కొనుగోలు చేసి ఇక్కడ అమ్మేందుకు ప్రయత్నించినట్లు తేలింది. వేంసూరు మండలం వెంకటాపురానికి చెందిన వ్యాపారి పాలా వెంకటకృష్ణారెడ్డి ఆంధ్రా ప్రాంతంలో 50బస్తాలకు పైగా ధాన్యాన్ని కొని వెంకటాపురం సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కేంద్రంలో ఇక్కడి రైతుల పేరిట విక్రయానికి యత్నించాడు. ఈ విషయాన్ని గుర్తించిన సొసైటీ ఉద్యోగి తుంగా పిచ్చయ్య ఫిర్యాదుతో వెంకటకృష్ణారెడ్డిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.19,144

రుణమాఫీపై రైతుల్లో ఆశలు

ఈనెల 30న విడుదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం

- గతంలో మూడుమార్లు చేసినా లక్షల్లో రైతుల ఎదురుచూపులు
- కుటుంబ నిర్ధారణ సర్వే చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అధికారులు
- తాజాగా ప్రభుత్వ ప్రకటనతో మళ్లీ తెరపైకి రుణమాఫీ

రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో మూడు విడతలుగా రుణమాఫీ చేసినా మిగిలిపోయిన అర్హులకు రైతు పండుగలో భాగంగా ఈ నెల 30వ తేదీన నగదు విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించారు. దీంతో అర్హులై ఉండి మూడు నెలలకు పైగా ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి జరగనుందని అంచనా.. – ఖమ్మంవ్యవసాయం



ఎన్నికలకు ముందు హామీ

కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయాన రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అనుకున్నట్లుగానే అధికారంలోకి రావడంతో జూలై 15న రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేసి ఆగస్టు 15 నాటికి ప్రక్రియ పూర్తిచేస్తామని ప్రకటించింది. రూ.2లక్షల లోపు పంట రుణాలు కలిగిన అర్హులైన రైతులకు మూడు విడతల్లో రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడిస్తూ తొలుత రేషన్ కార్డును ప్రామాణికం చేశారు. ప్రభుత్వం ఏళ్లుగా కార్డులను జారీ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో సర్వే ద్వారా అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. రైతు భరోసా పేరిట పోర్టల్‌ను ఏర్పాటు చేయగా, అధికారులు కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ చేపట్టారు. ఆపై రుణమాఫీకి అర్హులను గుర్తించి నివేదికలు సమర్పించారు.

మరో 2లక్షల మందికి అవకాశం

రైతు పండుగలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రైతులకు రుణమాఫీ నగదు జమ చేస్తామని ప్రకటించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 2లక్షల మందికి లబ్ధి జరిగే అవకాశముందని వ్యవసాయ, బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. అధికారుల అంచనా మేరకు ఖమ్మం జిల్లాలో 1.70 లక్షల మందికి భద్రాద్రి జిల్లాలో 25వేల నుంచి 30 వేల మంది రైతుల రుణమాఫీకి అవకాశం ఉన్నట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

జిల్లాల వారీగా రుణమాఫీ వివరాలు

విడత	ఖమ్మం జిల్లా		భద్రాద్రి జిల్లా	
	రైతుల సంఖ్య	రుణమాఫీ (రూ.కోట్లలో)	రైతుల సంఖ్య	రుణమాఫీ (రూ.కోట్లలో)
మొదటి	57,857	264.22	28,450	134.41
రెండో	33,942	262.50	16,889	143.05
మూడో	23,546	245.85	11,566	127.27
మొత్తం	1,15,345	772.57	56,905	404.73

పెద్ద సంఖ్యలో మిగిలిన రైతులు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇంకా పెద్దసంఖ్యలో రైతులకు రుణ మాఫీ కావాల్సి ఉంది. ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 నాటికి తీసుకున్న రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో 3.75 లక్షల మంది రైతులు రూ.2,400 కోట్ల మేర, భద్రాద్రి జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు రూ.వెయ్యి కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. ఇందులో మూడు విడతలు కలిపి మూడో వంతు రైతులకు మాత్రమే రుణమాఫీ నగదు జమ అయింది. ఖమ్మం జిల్లాలో 1,15,345 మంది రైతులకు సుమారు రూ.772.57 కోట్లు, భద్రాద్రి జిల్లాలో 56,905 మంది రైతులకు సుమారు రూ. 404.73 కోట్లు రుణమాఫీ అయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌కు నివాళి


ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతదేహం వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ – వసంతలక్ష్మి గురువారం నివాళులర్పించారు. ఖమ్మంలోని మమత ఆస్పత్రి మార్చురీలో భద్రపరచిన ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించాక పువ్వాడ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హేమంత్‌రావు, నాయకులు జానీమియా, దండి సురేష్, పోటు కళావతి పాల్గొన్నారు.

నేడు సంతాప సభ

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంతాపసభను శుక్రవారం ఉదయం సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకుడు దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రసాద్ మృతదేహాన్ని పార్టీ కార్యాలయానికి తీసుకురానుండగా, సంతాప సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం 11 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ప్రసాద్ అంతిమ యాత్ర మొదలవుతుందని, ఆతర్వాత ఆయన మృతదేహాన్ని వైద్యపరీక్షల నిమిత్తం మమత ఆస్పత్రికి అందజేయనున్నట్లు తెలిపారు.

ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్త


శిక్షణలో మాట్లాడుతున్న ఏటీడీఓ సత్యవతి

ఖమ్మంరూరల్: వసతి గృహాల్లో ఆహారం కలుషితం కాకుండా తయారీదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏటీడీఓ సత్యవతి సూచించారు. ఖమ్మం రూరల్ గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట సిబ్బంది, హెచ్‌డబ్ల్యూఓలు, ప్రధానోపాధ్యాయులకు గురువారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఏటీడీఓ మాట్లాడుతూ నాణ్యమైన సామగ్రి ఎంచుకోవడమే కాక తాజా కూరగాయలతో వంటలు చేయాలని, వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హెచ్‌ఎంలు వంట తయారీని పరిశీలించడంతో పాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తెలిపారు.

నాణ్యత పాటించాలి

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత పాటించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యాన గురువారం ఆయన ఖమ్మం ఎన్నెస్పీకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కూరగాయలు, సామగ్రి నాణ్యతపై నిర్వాహకులకు సూచనలు చేశారు. కాగా, ఎంఈఓ శైలజ ఇక్కడే భోజనం చేశారని తెలిపారు. సీఎంఓ రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, రఘునాథపాలెంలోని కేజీబీవీని కూడా తనిఖీ చేసిన డీఈఓ సరుకులను పరిశీలించి వంట నిర్వాహకులతో మాట్లాడారు. వంట తయారీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఎం లలితకు సూచించారు.

ఆస్పత్రుల్లో తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

అనుమతి లేని ఆస్పత్రి సీజ్


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి


అజయ్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని అజయ్ ఆర్‌ఎంపీ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి గురువారం తనిఖీ చేశారు. అనుమతి లేకుండా ఆరు బెడ్లు ఏర్పాటు చేసి అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నట్లు గుర్తించి ఆర్‌ఎంపీని మందలించడంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. అలాగే పక్కనే ఉన్న మెడికల్ షాపును పరిశీలించగా డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సమీపాన ఉన్న ఆర్‌జేఆర్ హెర్బల్ క్లినిక్‌లోనూ తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ హోమియోపతి కాకుండా అల్లోపతి వైద్యం చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. అలాగే, మయూరి ఆస్పత్రిలో అబార్షన్లు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుతో తనిఖీ చేసి పీజీ చేయకుండానే బోర్డు పెట్టడంపై వైద్యుడిని మందలించారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, రామారావు, డెమో సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన పూలే


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణ పాటుపడిన మహాత్ముడు జ్యోతిబాపూలే అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు దక్కేలా సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ గౌస్, లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, ఎర్రం బాలగంగాధర తిలక్, బోజెడ్ల సతీష్, బమ్మిడి శ్రీనివాస్‌యాదవ్, కమతం రామకృష్ణ, గజ్జెల్లి వెంకన్న, చల్లా ప్రతిభారెడ్డి పాల్గొన్నారు.

'రైతు పండుగ'కు తరలివెళ్లాలి

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 30న జరగనున్న రైతు పండుగను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఈమేరకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి 'చెకుముకి' పోటీలు


విజేతలుగా నిలిచిన వారితో జేవీవీ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు(పోటీలు) నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయగా ఖమ్మం నయాబజార్ పాఠశాలలో గురువారం పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు హాజరైన 240 మంది విద్యార్థులకు విభాగాల వారీగా పరీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఇక్కడ మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు డిసెంబర్ 14నుంచి ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు హాజరవుతారని జేవీవీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్, రామారావు తెలిపారు. తొలుత ప్రశ్నపత్రాలను ఎంఈఓ ఆవిష్కరించగా జేవీవీ బాధ్యులు శివన్నారాయణ, ఎల్.వీ.రెడ్డి, తాతా రాఘవయ్య, ఎస్వీఆర్.పురుషోత్తం, శ్రీరాములు, ఐలయ్య, సీతారామారావు, రామకృష్ణ, డాన్ బాస్కో, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

నకిలీ బంగారం నిందితులపై చట్టపరమైన చర్యలు

ఖమ్మంవ్యవసాయం: నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఓ బ్యాంకు యాజమాన్యం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. బంగారం పూతతో కూడిన ఆభరణాలను తాకట్టు పెట్టిన కొందరు ఖమ్మంలోని పలు బ్యాంకుల బ్రాంచ్‌ల నుంచి రుణాలు తీసుకున్న విషయం తాజాగా బయటపడింది. ఇప్పటికే ఆయా బ్యాంకుల అధికారులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిశారు. ఈక్రమంలో ఓ బ్యాంకు యాజమాన్యం నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందిన వారి ఆధార్ కార్డులు, చిరునామా ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించింది. దీంతో గురువారం సదరు బ్యాంకు ఉద్యోగులు సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి వివరాలు అందించినట్లు సమాచారం.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య


యశ్వంత్ ఫణీందర్ (ఫైల్)

తల్లాడ: పొలం వద్ద పనికి ఆలస్యం రావడంతో తండ్రి మందలించగాఓ యువకుడు ఆత్మహత్యత చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... ఈనెల 23వ తేదీన గ్రామానికి చెందిన దుగ్గిదేవర యశ్వంత్ ఫణీందర్(21)ను తండ్రి శ్రీనివాసరావు పొలంలో పని ఉన్నందున త్వరగా రావాలని చెప్పి వెళ్లాడు. అయితే, ఫణీందర్ ఆలస్యంగా వెళ్లడంతో తండ్రి మందలించాడు. దీతో ఆయన అదేరోజు సాయంత్రం అంబేద్కర్‌నగర్ సమీపంలోని గుట్టల వద్ద పురుగుల మందు తాగి అక్కకు ఫోన్ చేశాడు. ఈమేరకు కుటుంబీకులు వెళ్లి ఫణీందర్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై పిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు తెలిపారు.

సాగర్ కాల్వలో దూకి వ్యక్తి..


సత్యనారాయణ (ఫైల్)

ఏన్కూరు: మండలంలోని సాగర్ కాల్వలో దూకిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన నోముల సత్యనారాయణ (30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఏలూరుకు చెందిన శిరీషతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వివాహ సమయాన సుమారు రూ.5 లక్షలు అప్పు చేయడమే కాక మరో మారు అప్పు తీసుకుని ఆటో కొన్నాడు. అప్పుల విషయమై కుటుంబంలో గొడవలు జరుగుతుండడం, వీటిని తీర్చే మార్గం లేక ఈనెల 26న సత్యనారాయణ ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబీకులు వెతుకుతుండగా గురువారం ఏన్కూరు సాగర్ కాల్వలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఈమేరకు ఎస్‌ఐ రఫీ ఘటనాస్థలంలో పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇరువురి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నేలకొండపల్లికి చెందిన కె.సాయి(25) నెయిల్ పాలిష్ తాగగా కుటుంబీకులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. అలాగే, ముదిగొండ మండలంలోని చిన్నమండవకు చెందిన నాగరాజు(30) ఎలుకల మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనకు కుటుంబీకులు నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు. అయితే, వీరి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

జాబ్‌మేళాలో 16మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్‌సెంటర్‌లో నిర్వహించిన గురువారం జాబ్‌మేళాలో 16మంది ఎంపికయ్యారు. రెండు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించగా 39 మంది హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం 16మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని వెల్లడించారు.

గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్(37) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ఖమ్మంలోని తన సోదరుడి వద్ద ఉండగా గురువారం ఉదయం ఆకస్మాత్తుగా వాంతులు చేసుకుంటూ కుప్పకూలాడు. దీంతో ఆస్పత్రికి తరలించే క్రమాన మార్గమధ్యలోనే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని నాగులవంచకు తరలించగా ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మేరీ క్రిస్టియానా, చంద్రశేఖర్, రవీందర్, కామేశ్వరరావు, షఫీ, నిర్మల్‌కుమార్, కృష్ణానాయక్, శోభన్, శ్రీనివాస్, రజిత తదితరులు నివాళులర్పించారు. అలాగే, అంత్యక్రియల నిమిత్తం శ్రీనివాస్ తల్లిదండ్రులకు రూ.20వేల నగదు అందజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు...

తల్లాడ: మండలంలోని కొత్త నారాయణపురం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తల్లాడ వైపు నుంచి బిల్లుపాడు వెళ్తున్న వరిగడ్డి ట్రాక్టర్‌ను సత్తుపల్లి నుండి తల్లాడ వైపు అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై కూర్చున్న షేక్ మీరా(37)కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఇదే ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న బిల్లుపాడుకు చెందిన చీమకుర్తి వెంకన్న, కాళంగి కాంతారావు సైతం గాయపడ్డారు. ఈమేరకు పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...


నాగబాబు (ఫైల్)

తల్లాడ: మండలంలోని రంగంబంజరలో గురువారం తెల్లవారుజామున వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. రంగంబంజరలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఇంటి నుంచి పిన్నిశెట్టి నాగబాబు(32) తెల్లవారుజామున బయటకు వచ్చి మూత్రవిసర్జన కోసం రోడ్డు పక్కగా వెళ్తున్నాడు. ఈక్రమాన అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో నాగబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన సోదరుడు కృష్ణయ్య కాసేపటికి గమనించి కల్లూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జీవీయర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెంలో చేపల చెరువు పని చేస్తున్న పోలంపల్లి లక్ష్మీనారాయణ(35) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మధిర నియోజకవర్గానికి చెందిన ఆయన నాలుగేళ్ల క్రితం అత్తగారి ఊరైన ముత్యాలగూడెం వచ్చి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే చేపల చెరువు వద్ద పనికి కుదిరాడు. గురువారం అక్కడకు వెళ్లిన ఆయన మృత్యువాత పడ్డాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉండగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆత్కూరులో పట్టపగలే చోరీ

మధిర: మధిర సమీపాన ఆత్కూరులో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానిక తునికిపాడు రోడ్డులో నివాసం ఉంటున్న మీనుగు నాగయ్య కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఉదయం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండటంతో పరిశీలించగా ఇంట్లో దాచిన సుమారు రూ.1.50లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. కాగా, మధిర పట్టణంలో ఇటీవల చోరీల సంఖ్య పెరగగా, అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓ ఇంట్లో చోరీ, రెండిళ్లలో చోరీకి యత్నం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో పలువురి ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించారు. గ్రామానికి చెందిన బచ్చలకూరి జయమ్మ నివాసంలో రూ.4 వేల నగదు, పట్టీలు చోరీ చేశారు. అలాగే, బచ్చలకూరి నాగేశ్వరరావు, కమలమ్మ ఇళ్లలో దొంగతనానికి తలుపులు తీస్తుండుగా ఇంటి యాజమానులు మేల్కొని కేకలు వేయగా దుండగులు పారిపోయారు. గ్రామస్తులు వారిని వెంబడించినా దొరకలేదు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

డిస్కంల దివాలా బాట!

- తీవ్ర ఆర్థిక నష్టాల్లో దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2022–23 నాటికే రూ.6,76,681 కోట్లకు చేరిన నష్టాలు
- తెలంగాణలోని రెండు డిస్కంల నష్టాలు రూ.60,922 కోట్లు
- నష్టాల్లో దేశంలోనే ఐదో స్థానంలో తెలంగాణ డిస్కంలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఏటేటా నష్టాల్లో కూరుకుపోతున్నాయి. అత్యధిక నష్టాలున్న డిస్కంలు కలిగిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నది. దేశంలో ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని డిస్కంలకు కలిపి 2015–16లో రూ.3,74,099 కోట్ల నష్టాలు ఉండగా.. 2022–23 నాటికి అవి రూ.6,76,681 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో తెలంగాణ డిస్కంల నష్టాలు రూ.16,520 కోట్ల నుంచి రూ.60,922 కోట్లకు ఎగబాకాయి. రాజ్యసభలో ఎంపీ సంజయ్‌కుమార్ ఝా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలు వెల్లడించింది. ప్రభుత్వరంగ డిస్కంల నష్టాల్లో రూ.1,62,507 కోట్లతో తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. రూ.92,070 కోట్ల నష్టాలతో రాజస్థాన్, రూ.91,632 కోట్ల నష్టాలతో ఉత్తరప్రదేశ్, రూ.64,843 కోట్ల నష్టాలతో మధ్యప్రదేశ్ వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి.

లాభాల్లో ప్రైవేటు.. నష్టాల్లో సర్కారీ సంస్థలు

దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి దివాలా అంచున నిలువగా, ప్రైవేటు రంగ డిస్కంలు మాత్రం లాభాల్లో దూసుకుపోతున్నాయి. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగ డిస్కంల లాభాలు రూ.12,146 కోట్లు ఉండగా.. 2022–23 నాటికి రూ.23,116 కోట్లకు పెరిగాయి. ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రైవేటు డిస్కంలు ఉండగా, అవన్నీ లాభాల్లోనే నడుస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో 42 డిస్కంలు ఉండగా.. గుజరాత్‌లోని మూడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌లో ఒక్కో డిస్కం కలిపి మొత్తం ఐదు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. మిగిలిన 37 ప్రభుత్వ రంగ డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి.

మోయలేని అప్పుల్లో దక్షిణ తెలంగాణ డిస్కం


తెలంగాణలో రెండు ప్రభుత్వ రంగ డిస్కంలున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు 2015–16లో రూ.10,625 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.42,330 కోట్లకు చేరాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) నష్టాలు ఇదే కాలంలో రూ.5,895 కోట్ల నుంచి 2022–23 నాటికి రూ.18,592 కోట్లకు పెరిగాయి.

భారీగా పెరిగిన అప్పులు

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ డిస్కంల అప్పులు 2015–16లో రూ.4,08,941 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.6,61,263 కోట్లకు పెరిగాయి. ఇదేకాలంలో తెలంగాణ డిస్కంల అప్పుల రూ.13,944 కోట్ల నుంచి రూ.35,883 కోట్లకు పెరిగాయి.

దేశంలోని డిస్కంల పరిస్థితి

- మొత్తం ప్రభుత్వరంగ డిస్కంలు 42
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగ డిస్కంలు 37
- 2022–23 నాటికి సర్కారు డిస్కంల నష్టాలు రూ.6,76,681
- లాభాల్లో ఉన్నవి 5
- దేశంలో మొత్తం ప్రైవేటు డిస్కంలు 12
- లాభాల్లో ఉన్న ప్రైవేటు డిస్కంలు 12



కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. సిరిసిల్ల కలెక్టర్‌ను 'సన్నాసి.. కాంగ్రెస్ కార్యకర్త'.. అంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఒక సభలో వ్యాఖ్యానించడం తెలిసిందే. పాలనా విధానాలు, రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్లు నిర్వర్తించే బాధ్యతలకు విరుద్ధంగా కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని వారు మండిపడ్డారు. ప్రజాసేవలో అధికారి విధులను నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వహించాల్సి ఉంటుందని సంఘాలు గుర్తు చేశాయి. కానీ ఊహించని ఇటువంటి నిరాధార ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయని తెలిపాయి. సిరిసిల్ల కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఐపీఎస్ అధికారుల సంఘం పేర్కొంది. సివిల్ సర్వీసు అధికారుల గౌరవం, స్వతంత్రత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడేందుకు అండగా నిలబడతామని స్పష్టం చేసింది.

సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలను నమోదు చేయించుకున్నారు. గురువారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44లోని సీఎం నివాసానికి వెళ్లిన ఎన్యుమరేటర్లు ఆయన వివరాలను నమోదు చేశారు. వారితో పాటు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైద్యారోగ్య శాఖకు సీఎం అధిక ప్రాధాన్యం

వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. భారీగా నిధుల కేటాయింపుతో పాటు ఆరోగ్యశాఖలో నియామకాలపైనా దృష్టి సారించి తదనుగుణంగా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొంది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసిన ముఖ్యమంత్రి.. తొలి ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖలో నియామకాలు జరపడంతో పాటు నూతన వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల మంజూరు, సీట్లు, పడకల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వివరించింది. దేశంలో తొలిసారిగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన విషయాన్ని ప్రభుత్వం వివరించింది. ఈ కార్డులతో రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, రోగి వివరాలన్నీ హెల్త్ ప్రొఫైల్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించింది.

ఏడాది కాలంలో వైద్యారోగ్యశాఖలో చేపట్టిన కార్యక్రమాలపై ప్రభుత్వ వివరాలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష ఫీజు గడువును మరోసారి పెంచారు. విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్యపు రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.200తో 19 వరకు, రూ.500తో డిసెంబర్ 30 వరకూ ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

విద్యార్థుల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే వేటే..

▶ మొదటి పేజీ తరువాయి

ఏమాత్రం ఏమరుపాటుగా ఉండవద్దని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలినా సదరు అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

తరచూ తనిఖీలు చేయండి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై ఇదివరకే పలుమార్లు సమీక్షించానని గుర్తు చేశారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. ఈ మేరకు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రతిష్టపాలు చేసేందుకు కొందరి యత్నాలు

విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని.. పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము ఇలా సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నా.. కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ప్రకటించారు. వసతి గృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా వదంతులు సృష్టిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆహార నాణ్యతపై టాస్క్‌ఫోర్స్!

మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో పంపిణీ చేస్తున్న ఆహారం నాణ్యత పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మొదలు... సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభు త్వ వైద్య కళాశాలల్లో అందించే ఆహారం నాణ్య తపై నిఘా, పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ కమి టీని ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖతోపాటు గిరిజన, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలు, వైద్యారోగ్య శాఖ పరిధి లోకి వచ్చే అన్ని విద్యా సంస్థల్లో అందించే ఆహా రం నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ కమి టీకి అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో సభ్యులుగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ లేదా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సంబంధిత విద్యా సంస్థ ఉన్నతాధికారి/ అదనపు సంచాలకుడు, విద్యా సంస్థ జిల్లా స్థాయి అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ/ డీటీడబ్ల్యూఓ/డీబీసీడబ్ల్యూఓ/ డీఈఓ) తదితరులుంటారు. ఈ కమిటీ నిర్దేశించిన విద్యా సంస్థలను సందర్శించి ఆహార భద్రత చర్యలను పరి శీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా సంస్థలో లోటుపాట్లను గుర్తిస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు బాధ్యులపై చర్యల కోసం సిఫార్సు చేయాలని సూచించింది.

విద్యా సంస్థల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు, పర్యవేక్షక అధికారి

టాస్క్‌ఫోర్స్ మాత్రమేకాకుండా విద్యా సంస్థల స్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీలను, పర్యవేక్షక అధికారిని సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి సంబంధించిన మార్గదర్శ కాలను జారీ చేసింది. విద్యా సంస్థల్లో మెరుగైన, బలవర్థకమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. కలుషిత ఆహారంతో కలిగే అనారోగ్య సమస్యలు, తదుపరి పరిణామాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

- ఫుడ్ సేఫ్టీ కమిటీలో విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయుడు/ ప్రిన్సిపల్/ వార్డెన్‌తోపాటు మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు.
- ఈ కమిటీ సభ్యులు ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట గదిని తనిఖీ చేయాలి. తర్వాత వంటగది నిబంధనలకు అనుగుణంగా నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించాలి.
- వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను కమిటీ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాతే విద్యార్థు లకు అందించాలి. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాలి.
- త్వరలో నోడల్ డిపార్టుమెంట్ యాప్‌ను తయారు చేస్తుంది. అప్పటి నుంచి తనిఖీలకు సంబంధించిన ఫోటోలను, ఇతర సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఇక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి విద్యాసంస్థకు ప్రత్యేకంగా ఒక పర్యవేక్షక అధికారికి నియమిస్తారు. ఈ పర్యవేక్షక అధికారి ప్రతిరోజు భోజనం వండే ముందు, తర్వాత తనిఖీ చేస్తారు. అక్కడి పరిస్థితిని చిత్రాలు తీసి జిల్లా కలెక్టర్/ సంబంధిత ఉన్నతాధికారికి సమర్పిస్తారు.
- వీటన్నింటికి సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.



విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ మల్హర్ మండలం మల్లారం కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అల్పాహారం, భోజన సదుపాయాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆహార నాణ్యత పరిశీలనకు ప్రతీ శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోలు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా వార్తలు

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

గిరిజన గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీఓ నాగార్జునరావు, అధికారులు

మణుగూరు రూరల్: ఉపాధ్యాయులు మెరుగైన బోధన ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని గిరిజన గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు సూచించారు. మణుగూరు మండలం గుట్టమల్లారంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల పరిసరాలు, విద్యార్థుల వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను తనిఖీ చేసిన ఆర్‌సీఓ మెనూ ఆధారంగా మధ్యాహ్న భోజనం అమలవుతోందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై బోధన చేయాలని, వారి సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకాసి గూళ్లను సందర్శించిన అధికారులు



పురాతన రాకాసి గూళ్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని మనుబోతులగూడెం గ్రామపంచాయతీ పరిధి వేములూరులో పురాతన రాకాసి గూళ్లను అధికారులు గురువారం పరిశీలించారు. 'పురాతన రాకాసి గూళ్లు!' శీర్షికన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్న అంశంపై బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గ్రామాన్ని సందర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు పురాతనమైన రాకాసి గూళ్లను పరిశీలించిన వివిధ శాఖల అధికారులు వివరాలతో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. సెర్ప్ డీపీఎం రంగారావు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ సీతరాములు, టీఏలు వెంకటేష్, కాంతారావు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యమే కీలకం

- మామిడిలో పూమొగ్గలను ఉత్తేజపర్చాలి
- మిగతా పంటల్లోనూ సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ
- ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ సూచనలు



కూసుమంచి మండలంలోని జామ తోటలో పరిశీలిస్తున్న అధికారులు



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: పంటల్లో రైతులు చేపట్టే యాజమాన్య పద్ధతులపై దిగుబడులు ఆధారపడి ఉంటాయని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. జిల్లాలోని పలు మండలాల్లో ఉద్యాన పంటల సాగును ఆయన పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా పంటల యాజమాన్యం, ఆయా పంటలకు ఆశించిన తెగుళ్లు, రైతులు చేపడుతున్న సస్యరక్షణ చర్యలను తెలుసుకుంటూ అవసరమైన సూచనలు ఇస్తున్నారు. మామిడి, ఆయిల్ పామ్ పంటల సాగులో ప్రస్తుత తరుణాన తీసుకోవాల్సిన మెళకువలు, తెగుళ్ల నివారణకు పాటించవలసిన చర్యలపై ఆయన ఇచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

మామిడి

ఖమ్మం జిల్లాలో 32,105 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. మామిడిలో పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించాల్సిన సమయమిది. ఇందు కోసం ఆడపూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రా., బోరాన్ 2 గ్రా.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మామిడిలో పూత రాక ముందు డిసెంబరులో తేనె మంచు పురుగులు చెట్ల మొదళ్లు, కొమ్మల బెరళ్లలో దాగి ఉంటాయి. పూత సమయానికి అవి చెట్టుపైకి ఎగబాకి పూగుత్తులను ఆశించి నష్టపరుస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి తొలి దశలోనే తేనెమంచు పురుగులను నివారించేందుకు ఆసిఫేట్‌ను లీటరు నీటికి 1.5 గ్రా. లేదా క్లోరిపైరిపాస్‌ను లీటర్ నీటికి 2.5 మి.లీ. చొప్పున మరియు నువాన్ మందు లీటర్ నీటికి 0.5 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పూత ప్రారంభదశలో తేనె మంచు ఆశించే అవకాశం ఉంది. పూత ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ.ను లీటర్ నీటికి లేదా థయోమిథాక్సాం 0.4 గ్రాములను లీటర్ నీటికి కలిపి, గంధకం 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తేతేనెమంచు పురుగు, బూడిద తెగులును అరికట్టవచ్చు. ఈ మందుల పిచికారీని రైతులు త్వరగా పూర్తిచేయాలని, లేకపోతే చీడలు పూతను నష్టపరిస్తే పిందెలు సరిగా ఏర్పడవు.

ఆయిల్ పామ్

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తగిన మెళకువలు పాటిస్తే అనేక ప్రయోజనాలను ఉంటాయి. ప్రధానంగా పంట సాగు సమయాన మొక్కలను ప్రణాళికాయుతంగా నాటాలి. త్రిభుజాకారం / చతురస్రాకార వ్యవస్థలో 9 మీటర్ల దూరంతో మొక్కలను నాటాలి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ మొక్కలను మొవ్వకుళ్లు తెగులు ఆశిస్తోంది. దీని నివారణకు కార్బండజిమ్ ఒక గ్రా.ను లీటర్ నీటిలో(100–250 మి.లీ. ద్రావణం) కలిపి మువ్వులో పోయాలి. రైనోసిరాస్ బీటిల్‌ను నివారించడానికి 20 గ్రాముల నాఫ్తలిన్ బాల్‌లను చిల్లులు గల సాచెట్లలో ఉంచాలి. ఆయిల్‌పామ్ తోటల్లో అవసరానికి అనుగుణంగా 160 నుండి 250 లీటర్ల నీటిని రోజుకు ఒక చెట్టుకు అందించాలి. ఐదేళ్లు పైబడిన తోటల్లో ఎకరానికి 5 కిలోల యూరియా, 3కిలోల డీఏపీ మరియు 5కిలోల ఎంఒపీతో ఫలదీకరణం చేయాలి. లేదంటే ఎరువులు యూరియా 650 గ్రాములు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 940 గ్రాములు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 500 గ్రాములను ఒక చెట్టుకు వేయాలి. మూడేళ్ల వరకు లేత తోటల్లో ప్రత్యేక సాధనంతో ఆడ, మగ పూగుత్తలను తొలగించాలి. అయితే, ఆకులను కత్తిరించవద్దు, కట్టవద్దు.

నిమ్మ

నిమ్మ చెట్ల పాదుల చుట్టూ మల్చింగ్ చేయాలి. జిగ్ జాగ్‌గా ఉన్న, ఎండిన కొమ్మలను తొలగించాలి. నేలమట్టం నుండి 2 అడుగుల ఎత్తు వరకు ప్రధాన మొదలుపై పక్క శాఖలు అభివృద్ధి చెందకుండా చూసుకోవాలి. పురుగుల నియంత్రణకు డైకోఫాల్ 3 మి.లీ.ను లీటర్ నీటికి లేదా వెట్టబుల్ సల్ఫర్ (80శాతం డబ్ల్యూపీ) 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉద్యోగుల మానసికోల్లాసానికే వనభోజనాలు

ఆర్టీసీ ఖమ్మం ఆర్‌ఎం సరిరామ్‌నాయక్



ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్‌ఎం సరిరామ్‌నాయక్

మధిర: విధి నిర్వహణలో నిత్యం తలమునకలయ్యే ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ నాయక్ తెలిపారు. గురువారం మధిర డిపో ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం మాట్లాడుతూ కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహిస్తున్నా విధినిర్వహణలో ఉండే ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబంతో హాజరుకాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యాన ఆర్టీసీ కుటుంబమే సామాజికవర్గంగా వన భోజనాలకు రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేఎంపీఎల్‌లో ప్రథమ స్థానం సాధించిన డ్రైవర్ పేరయ్యతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. అలాగే, వన సమారాధనలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, డిపో మేనేజర్ శంకర్‌రావు, ఉద్యోగులు టీసీఎస్.రెడ్డి, ఎంఆర్‌సీ.రావు, డి.వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆరోగ్యంపై పట్టింపు లేదా?'

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటిస్తూ విద్యార్థులు అస్వస్థతకు గురైనా ప్రభుత్వంలో చలనం రావడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పిల్లల ప్రాణాలను గాలికి వదిలేస్తోందని పేర్కొన్నారు. ఒక్క మాగనూర్‌లోనే కాకుండా అనేక జిల్లాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాగడం లేదని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులు బయట పదార్థాలు తినడంతోనే అనారోగ్యం పాలయ్యారని అధికారులతో చెప్పించడం దుర్మార్గమని పేర్కొన్నారు. అంతేకాక ఆందోళనలు చేస్తున్న పీడీఎస్‌యూ, ఇతర సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు రంగారావు తెలిపారు.

అంతటా కాంట్రాక్టు కార్మికులే..



బెల్ట్‌పై పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

- అయినా దక్కని ప్రతిఫలం
- సింగరేణి యాజమాన్యం తీరుపై విమర్శలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మికులు, సంఘాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఇంతింతై వటుడింతై అన్న చందంగా కాంట్రాక్ట్ వ్యవస్థ విస్తరించింది. పర్మనెంట్ కార్మికులతో పోటీగా భూగర్భ గనులు, సర్ఫేస్ విభాగాల్లో వీరితో పని చేయిస్తున్నారు. ఇవి కాకుండా ఆర్సీ, ఐఆర్‌పీఎం, పీఎం, వెల్ఫేర్, ఫైనాన్స్, సివిల్ విభాగాల్లోనూ పని చేయిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ ఏరియాలోని మెయిన్ ఆస్పత్రి, వర్క్‌షాపు, స్టోర్స్, ఎస్‌అండ్‌పీసీతోపాటు మరికొన్ని విభాగాల్లో 1000 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ 2004లో ఇల్లెందు జేకే ఓసీ సివిల్ విభాగంలో 16 మందితో ప్రారంభం కాగా.. ప్రస్తుతం 56 విభాగాల్లో సుమారు 32 వేల మంది పనిచేస్తున్నారు. ఇంతవరకూ బాగానే వీరి వేతనాలు, ఇతర అంశాల్లో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై పలువురు మండిపడుతున్నారు.

కాంట్రాక్టర్లకే కాసులు..

సింగరేణి సంస్థలో కాంట్రాక్టీకరణ విధానం మొదలైనప్పటి నుంచీ కాంట్రాక్టర్లకే కాసులు కురుస్తున్నాయి. గతంలో సింగరేణి వ్యాప్తంగా సుమారు 100 మంది ఉన్న కాంట్రాక్టర్ల సంఖ్య నేడు వేల మందికి చేరింది. అంతేకాకుండా గతంలో ఒక టెండర్‌లో 20 మంది కార్మికులు పనిచేస్తే ఇప్పుడు కొత్త వ్యక్తి టెండర్ పొందితే మరో నలుగురైదుగురు పెరుగుతున్నారు. వీరి వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు కొంతమంది తీసుకుని పనిలో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా అధికారులు నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక సీనియర్ కార్మికుడు నెలంతా, రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తే రూ.50 నుంచి రూ.60 వేల వేతనం వస్తోంది. అదే కాంట్రాక్టర్లు ఏ పనీ చేయకుండానే కొన్ని టెండర్లలో రూ.లక్షకు పైగా దండుకుంటున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

విధులకు రాని కార్మికులకు జరిమానా విధిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధానాన్ని రద్దు చేయడంతో పాటు బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు, సోలార్, సులభ్, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా తదితర హక్కుల సాధనకు కార్మికులు ఉద్యమ బాట పట్టారు. ఇప్పటికే ఏరియాల వారీగా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. డిసెంబర్ 1 నుండి 5వ తేదీ వరకు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 5 నుండి 10వ తేదీ వరకు జీఎం, పీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టేందుకు కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

జరిమానా విధించడం సరికాదు

డ్యూటీకి రాని కార్మికుడికి నో వర్క్, నో పే విధానం అమలు చేయాల్సిన యాజమాన్యం పనికి రాని కాంట్రాక్ట్ కార్మికుడికి రెండు రోజుల వేతనం జరిమానా వేయటం సరికాదు. పర్మనెంట్ కార్మికులు నెలల కొద్దీ, సంవత్సరంలో 75 రోజులు పనిచేయకపోయినా.. వారిని బతిమిలాడి పని చేయిస్తున్న యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల ఇలా చేయడం సరికాదు. ఈ విధానం బ్రిటీష్ కాలంలో కూడా లేదు. దీన్ని వెంటనే రద్దు చేయాలి.

– యాకూబ్‌షావలీ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

రామయ్య సన్నిధిలో యతిరాజ జీయర్..



నిత్యకల్యాణమూర్తుల వద్ద పూజలు చేస్తున్న స్వామిజీ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని కర్ణాటకకు చెందిన 41వ యదుగిరి యతిరాజ నారాయణ జీయర్ మఠ స్వామిజీ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, వేదపండితులు, ఈఓ రమాదేవి ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం బేడా మండపంలో భక్తులకు ప్రవచనం అందజేశారు.